క్లుప్తంగా

నిల్వనీటితో ఇక్కట్లు



పొన్నూరు: పట్టణంలోని పదో వార్డు ఎరుకలవాడలోకి నీరు చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు కురిసిన ప్రతిసారి నీరు నిల్వ చేరుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. మోటారుతో నీటిని బయటకు పంపే విధంగా చర్యలు చేపట్టాలని మొరపెట్టుకున్నా ఇంజినీరింగ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. రోజుల తరబడి నీరు నిల్వ ఉండటంతో దోమలు విజృంభించి రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పొన్నూరు తహసీల్దార్ జియా బాధ్యతల స్వీకరణ



పొన్నూరు: మండల తహసీల్దార్‌గా జియా ఉల్ హక్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా పల్నాడు జిల్లా మాచర్ల మండలం నుంచి ఆయన పొన్నూరుకు వచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండల ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా బాధ్యతలు నిర్వహిస్తానని తెలిపారు. ప్రతి సోమవారం ప్రజాస్పందనలో స్వీకరించే అర్జీలను ఎలాంటి జాప్యం లేకుండా పరిష్కరిస్తామన్నారు. మండల ప్రజలకు ఏమైనా సమస్యలు, ఫిర్యాదులు ఉంటే తనను సంప్రదించాలని సూచించారు. తహసీల్దార్‌కు డీటీలు రాజా రమేష్ మోహన్, ఆర్‌ఐ శ్రీనివాస్, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

వెంకటశివ వర్మకు డాక్టరేట్



చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ వ్యక్తిగత కార్యదర్శిగా సేవలందిస్తున్న సీహెచ్ వెంకటశివ వర్మకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా అందించిందని విజ్ఞాన్ వీసీ పి.నాగభూషణ్ గురువారం తెలిపారు. ఎంప్లాయి రెటెన్షన్ స్ట్రాటజీస్ ఇన్ బిజినెస్ ప్రాసెస్ అవుట్‌స్టాండింగ్ సెక్టార్ 'విత్ స్పెషల్ రిఫరెన్స్ టు సెలెక్ట్ కాల్ సెంటర్స్ ఎట్ హైదరాబాద్–యాన్ ఎంపిరికల్ స్టడీ' అనే అంశంపై శివ వర్మ పరిశోధన చేశారని తెలిపారు. పీహెచ్‌డీ పట్టా పొందిన సీహెచ్ వెంకటశివ వర్మను పలువురు అభినందించారు.

శివ శివా.. ఇదేమి స్వామీ..!

- పెదకాకాని శివాలయంలో గాడితప్పిన పాలన
- రెండువర్గాలుగా విడిపోయిన అర్చకులు
- ఆగమ శాస్త్రానికి వ్యతిరేకంగా పూజలు
- కాంట్రాక్ట్ అర్చకులతో అభిషేకాలు
- భక్తుడి ఫిర్యాదుతో అర్చకులందరికీ షోకాజ్ నోటీసులు జారీ చేసిన డిప్యూటీ కమిషనర్
- ఉన్నతాధికారుల ఆదేశాలు బేఖాతరు చేస్తూ ప్లేట్ కలెక్షన్‌లు



పెదకాకాని శివాలయం వ్యూ

పెదకాకాని: పెదకాకాని భ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఆలయంలో పరిపాలన రోజు రోజుకూ గాడి తప్పుతుంది. స్వామివారికీ భక్తులకు మధ్య వారధిగా ఉండాల్సిన అర్చకులు వర్గాలుగా విడిపోయి ఆధిపత్య పోరుకు తెరలేపారు. పర్మినెంట్ అర్చకులకు పనిలేకుండా పక్కన కూర్చోబెట్టి ఎస్ఎంఆర్ (నామినల్ మస్టర్ రోల్) అర్చకులచే ఆగమ శాస్త్రానికి వ్యతిరేకంగా అభిషేక పూజలు చేయిస్తున్నారు. ఆలయాల్లో ప్లేట్ కలెక్షన్‌లు నిలిపివేయాలని రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేసినప్పటికీ అందుకు విరుద్ధంగా ప్లేట్ కలెక్షన్‌లు చేస్తున్నారు. నాగ ప్రతిమల వద్ద, ధ్వజస్తంభం వద్ద కొబ్బరిచెక్కలు పోగుచేసుకునే వారు సైతం భక్తులకు బొట్లు పెట్టి డబ్బులు వసూలు చేస్తున్నారు. అధికారులు మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అవుట్ సోర్సింగ్ అర్చకుడితో తూతూ మంత్రంగా శాస్త్రానికి విరుద్ధంగా అభిషేకపూజలు చేయించడంపై ఓ భక్తుడు ఫిర్యాదు చేయడంతో స్పందించిన ఆలయ డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్ అర్చకులందరికీ షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

మిద్దె రథం మూలన..

గతంలో ప్రతి శుక్రవారం సహస్ర దీపాలంకరణ, మిద్దె రథంపై స్వామివారి ఉత్సవమూర్తులను అలంకరించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసేవారు. ఆలయంలో స్వామివారికి నిత్య కల్యాణ పూజలు జరిపించేవారు. ప్రదక్షిణల నిమిత్తం రూ.5 లక్షలతో దాత మిద్దె రథం తయారు చేయించి ఆలయానికి బహూకరించారు. ప్రస్తుతం మిద్దె రథంపై స్వామివారిని అలంకరించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు, పూజలు, నిత్య కల్యాణసేవలకు మంగళం పాడారు. అర్చకులకు ఆదాయం వచ్చే పూజలను కొనసాగిస్తున్నారని పలువురు భక్తులు పేర్కొంటున్నారు. గతంలో స్వామివారికి నైవేద్యం కూడా పెట్టలేమని, పాకాచారిని ఏర్పాటు చేయడం, పాకాచారి తయారు చేసిన నైవేద్యం ఎస్ఎంఆర్ అర్చకులు ఆలయంలోనికి తెస్తేనే పెడతామని చెప్పిన సందర్భాలు కూడా ఉన్నాయి. పొంగళ్లు, పూజా సామగ్రిపై అదనంగా వసూలు చేస్తున్నారని పలువురు భక్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆలయంలో నిబంధనలకు విరుద్ధంగా విధులు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, ఆలయ ప్రతిష్టను కాపాడాలని భక్తులు కోరుతున్నారు.

దీనిపై ఆలయ డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్‌ను వివరణ కోరగా పెండ్యాల సురేష్ అనే భక్తుడు అవుట్‌సోర్సింగ్, ఎస్ఎంఆర్ అర్చకులచే అభిషేక పూజలు చేయిస్తున్నారని ఫిర్యాదు చేయగా అందరికీ షోకాజ్ నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. విచారించి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

యథేచ్ఛగా ప్లేట్ కలెక్షన్లు

శివాలయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్లేట్ కలెక్షన్‌లు యథేచ్ఛగా జరుగుతున్నాయి. కొందరు అర్చకుల పనితీరు తీవ్ర వివాదాస్పదంగా మారడంతో పాటు ఆలయ పవిత్రతను దెబ్బతీసేలా ఉందని పలువురు భక్తులు వాపోతున్నారు. కొందరు ప్రజాప్రతినిధి పేరు చెప్పి మరీ పెత్తనం చేస్తున్నారు.

చలపతిలో గూగుల్ ఆండ్రాయిడ్ టెక్ క్యాంప్



గుంటూరు రూరల్: సాంకేతిక రంగంలో విద్యార్థులను నిష్ణాతులను చేసేందుకు టెక్ క్యాంప్‌లు ఎంతో దోహదపడతాయని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. గురువారం నగరశివారుల్లోని లాం నందున్న కళాశాలలో గూగుల్ ఆండ్రాయిడ్ టెక్ క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎడ్యుస్కిల్స్ లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్ టీం అసోసియేట్ మేనేజర్ ఎస్‌వీ పవన్‌కుమార్ ఆండ్రాయిడ్ స్టూడియోను వినియోగించి వివిధ రకాల ఆండ్రాయిడ్ అప్లికేషన్స్ ఏ విధంగా రూపొందించాలో వివరించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో సాంకేతికత, జాబ్ మార్కెట్ కోసం విద్యార్థులు ఎల్లపుడూ సిద్ధంగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు సాంకేతిక నైపుణ్యాలను మెరుగు దిద్దుకోవాలన్నారు. విద్యార్థులు అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టిపెట్టండి

మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు



సిబ్బందికి సూచనలు ఇస్తున్న కమిషనర్

పొన్నూరు: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రోడ్లు, లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలో నీరు నిల్వ చేరకుండా తగిన చర్యలు చేపట్టాలని, పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టిపెట్టాలని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్ బాబు సిబ్బందిని ఆదేశించారు. గురువారం పట్టణంలోని పలు వార్డుల్లో ఆయన పర్యటించి మున్సిపల్, సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. 11 వార్డులోని ఎస్టీ కాలనీలో వర్షానికి నీట మునిగిన ఇళ్లను పరిశీలించారు. వెంటనే నీటిని బయటకు పంపేవిధంగా చర్యలు చేపట్టాలని సిబ్బందికి తెలిపారు. డ్రెయిన్లలో పూడిక తీత పనులు నిరంతరం చేపట్టాలన్నారు. రోడ్లపై చెత్త, వ్యర్థాలు నిల్వచేరితే చర్యలు తప్పవని హెచ్చరించారు. తాగునీటి కుళాయిల ద్వారా సరఫరా అయ్యే నీటిని ప్రతిరోజు పరిశీలించాలని సూచించారు. తాగునీరు రంగు మారడం, వాసన రావడం లాంటి సమస్యలను ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటి అందించే విధంగా సిబ్బంది పని చేయాలని అన్నారు.

ప్రజలకు భారంగా నిత్యావసరాలు



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, తదితరులు

పెదకాకాని: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడవసారి అధికారంలోకి వచ్చిన తరువాత నిత్యావసర సరుకుల ధరలు పెరిగి ప్రజలకు భారంగా మారాయని పాశం రామారావు అన్నారు. పెదకాకాని సుందరయ్యకాలనీలో గురువారం పాశం రామారావు మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర సరుకులు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలతో పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. భారత రాజ్యాంగంలోని సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తూ క్రిమినల్ చట్టాల్లో మార్పులు తెచ్చి ఉద్యమకారులు, ప్రతిపక్షాలపైనా దిగ్బంధనాన్ని పెంచే విధంగా ఆలోచనలు చేస్తున్నారన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమకాలీన రాజకీయాలపై ఈనెల 21వ తేదీన గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగే సభను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమానికి సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ అధ్యక్షత వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు చేసిన వాగ్దానాలకు అనుగుణంగా ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. సర్దుబాటు చార్జీల పేరుతో మరోసారి కరెంటు చార్జీలు పెంచే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని లేకపోతే ఆందోళనకు దిగుతామని పేర్కొన్నారు. సీపీఎం మండల శాఖ కార్యదర్శి బేతపూడి బాబూరావు, కార్యకర్తలు బురదగుంట సాంబయ్య, సంకూరి నీలాంబరం, కె.సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడిచేసిన యువకులపై కేసు

లక్ష్మీపురం: వినాయక చవితి సమయంలో చెక్కతో స్టేజీ వేసేందుకు ఖాళీ లేదని చెప్పినందుకు సెంట్రింగ్ పని ముగించుకుని ఇంటికి వెళుతున్న వ్యక్తిపై కొందరు యువకులు బీరు సీసాతో తలపై తీవ్రంగా దాడి చేసిన ఘటన కేవీపీ కాలనీలో జరిగింది. గాయాలపాలైన బాధితుడు ఆస్పత్రిలో చికిత్సపొంది అనంతరం నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా గురువారం రాత్రి కేసు నమోదు చేశారు. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీనివాసరావు పేటకు చెందిన పట్టంశెట్టి కోటేశ్వరరావు అనే వ్యక్తి సెంట్రింగ్ పని, చెక్కలతో స్టేజీ ఏర్పాటు చేయడం వంటి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. అయితే బుధవారం మధ్యాహ్నం సంపత్‌నగర్‌లోని సెంట్రింగ్ చెక్కలు ఆటోలో వేసుకుని కృష్ణబాబు కాలనీలో చక్కలు దింపి, కొండావెంకటప్పయ్య కాలనీ వైపుగా పయనం అయ్యాడు. ఆ ప్రాంతంలోని గేలక్సీ బార్ వద్ద ఆటోను నిలిపాడు. కోటేశ్వరరావును గమనించిన స్థానికంగా నివాసం ఉండే చాప, ప్రవీణ్ అనే యువకులు మరికొందరితో కలిసి మద్యం సేవించి కోటేశ్వరరావును అడ్డుకున్నారు. వినాయక చవితి సమయంలో తమ ప్రాంతంలో స్టేజీ ఏర్పాటుకు ఖాళీ లేదని చెబుతావా అంటూ చేతిలో ఉన్న బీరు సీసాతో కోటేశ్వరరావు తలపై కొట్టి గాయాలపాలు చేశారు. దీంతో బాధితుడిని స్థానికులు ప్రభుత్వ సమగ్రాసుపత్రిలో చికిత్సకు చేర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు చాప, ప్రవీణ్, మరికొందరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పట్నంబజారు: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన నగరంలో చోటు చేసుకుంది. వెస్ట్ ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేళంగిణి నగర్‌కు చెందిన కొండ్రు అజయ్‌కుమార్ (50) మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్నాడు.అమరావతి రోడ్డులో వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన మున్సిపాలిటీ చెత్తట్రక్కు ఢీకొట్టి, అజయ్‌కుమార్‌పైకి ఎక్కటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు ట్రక్కు సీజ్ చేసిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషిచేద్దాం

- కార్యకర్తలు ప్రజల సమస్యలు తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బలసాని కిరణ్‌కుమార్



కార్యకర్తల సమస్యలు తెలుసుకుంటున్న నియోజకవర్గ ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తూ ప్రజలకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. గురువారం ఏటుకూరు బైపాస్‌లోని నియోజకవర్గం కార్యాలయంలో వైఎస్సార్ సీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని ప్రజల సమస్యలు, గ్రామాల్లో ప్రజా సమస్యలపై చర్చించారు. గ్రామాల్లోని ప్రజలు తెలిపిన సమస్యలను వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కారించాలని కోరారు. త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు కార్యాచరణ, ప్రణాళికలపై నేతలతో మాట్లాడారు. గ్రామాల్లోని పార్టీ నాయకులు మన పార్టీకి చెందిన గ్రాడ్యుయేట్లను ఓటు నమోదు చేసుకునే విధంగా చూడాలని సూచించారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలమేరకు గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరం కృషిచేద్దామని తెలిపారు. కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి ఒక్కరం సమష్టిగా కృషిచేద్దామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు



వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న విశ్వవిద్యాలయం అధికారులు

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం నందున్న ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం పరిపాలన భవనంలో గురువారం ఆదికవి వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు మాట్లాడుతూ హిందువులకు మహా పవిత్రమైన రామాయణంను రచించిన మహాకవి వాల్మీకి అని తెలిపారు. వాల్మీకి జయంతిని జరుపుకోవడం ఎంతో సంతోషకరమన్నారు. వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

పెదకాకాని: పురాణ భారతీయ ఇతిహాసమైన రామాయణ రచయిత వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు గురువారం పెదకాకాని గ్రంథాలయంలో నిర్వహించారు. లైబ్రేరియన్ వేముల విజయ్‌కుమార్ వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వీఆర్వో కె.నాగేశ్వరరావు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన



ఉప్పలపాడు జడ్పీహెచ్ స్కూల్‌లో మాట్లాడుతున్న ప్రత్యూష సుబ్బారావు

పెదకాకాని: విద్యార్థులు సృజనాత్మక శక్తిని పెంపొందించుకుని భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని కెరీర్ కౌన్సెలింగ్ ట్రైనర్, సైకాలజిస్ట్, మోటివేషనల్ స్పీకర్ ప్రత్యూష సుబ్బారావు అన్నారు. యువజన సర్వీసుల శాఖ, స్టెప్, స్వశక్తి ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆదేశాల మేరకు విద్యార్థులకు గురువారం వ్యక్తిత్వ వికాసం, కెరీర్ మార్గదర్శకాలపై అవగాహన సదస్సు జరిగింది. పెదకాకాని మండలంలోని ఉప్పలపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రత్యూష సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ మార్గదర్శకాలు, న్యాయకత్వ లక్షణాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు కలిగిన సందేహాలను నివృత్తి చేసి వారి ఎదుగుదలకు అవసరమైన సలహాలను అందించారు. యువజన సర్వీసుల శాఖ, స్టెప్, స్వశక్తి మేనేజర్ బి.రాధిక విద్యార్థుల ఉన్నతికి, భవిష్యత్తుకు అవసరమైన సలహాలు, సూచనలు అందించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఔషధ ధరల పెంపు దారుణం

లక్ష్మీపురం: ఉబ్బసం, తలసేమియాతో బాధపడే వారు వినియోగించే మందుల ధరలను 50 శాతం పెంచడంపై అవగాహన సంస్థ ఆరోగ్య సభ బృందం నిరసన వ్యక్తంచేసింది. అరండల్‌పేటలోని ఆ సంస్థకార్యాలయంలో నాయకులు కొత్తమాసు మల్లికార్జునరావు, కార్యదర్శి కొండాశివరామిరెడ్డి ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. యోగాచార్యులు ఎ.ఇందుశేఖర్‌లు మాట్లాడారు.

అమ్మో.. ఆ రహదారులా..!



నల్లపాడు నుంచి అంకిరెడ్డిపాలెం మీదుగా హైవే వరకూ ఉన్న రోడ్డు దుస్థితి



వెంగళాయపాలెం నుంచి అంకిరెడ్డిపాలెం వరకు రోడ్డు పరిస్థితి

- అధ్వానంగా గ్రామీణ రహదారులు
- బురదకయ్యలుగా మారిన డొంక రోడ్లతో రైతుల ఇక్కట్లు
- గుంతల రోడ్లలో ప్రయాణం నరకం
- పట్టించుకోని ప్రభుత్వం, అధికారులు

గుంటూరు రూరల్: మండలంలోని గ్రామాల ప్రధాన రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. చిన్నపాటి వర్షానికి రోడ్లు తటాకాలను తలపిస్తూ ప్రయాణికులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. గత కొంతకాలంగా కురుస్తున్న వర్షాలకు గతంలో ఉన్న చిన్నపాటి గుంతలు సైతం నేడు భారీస్థాయిలో గండ్లుగా ఏర్పడి ప్రయాణికులకు నరకం చూపిస్తున్నాయి.

ఆ రోడ్డులో వెళ్తే వాహనాలు గోవిందా..!

మండలంలోని నల్లపాడు, అంకిరెడ్డిపాలెం మీదుగా ఎన్‌హెచ్ 16కు కనెక్ట్ చేస్తూ గత 15 ఏళ్ల క్రితం నిర్మించిన రోడ్డు నేడు అత్యంత ప్రమాదకరంగా తయారైంది. హైదరాబాద్, వినుకొండ, నరసరావుపేట, సత్తెనపల్లిలనుంచి భారీ వాహనాలు నగరంలోకి రాకుండా హైవే మీదుగా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా ఉండేందుకు 15 ఏళ్ల క్రితం నల్లపాడు శివారుల్లోంచి అంకిరెడ్డిపాలెం మీదుగా హైవే వరకూ రోడ్డును నిర్మించారు. నిర్మించిన అనంతరం ఎవ్వరూ దానిని పట్టించుకోకపోవటం, కనీసం మరమ్మతులు చేపట్టకపోవటంతో నేడు ఆరోడ్డులో కనీసం రెండు నుంచి మూడు అడుగుల లోతులో భారీస్థాయి గుంతలు ఏర్పడి రోడ్డు పూర్తిగా గుంతలమయంగా తయారైంది. భారీ వాహనాలకోసం నిర్మించిన రోడ్డు కావటంతో మిర్చిలోడులు, ధాన్యం, ఇతర ఎరువులు, క్రషర్‌ల లారీలు, గ్రావెల్ లారీలు భారీ లోడు లారీలు ఇదే రోడ్డులో నగరంలోకి వెళ్లకుండా హైవేమీదుగా విజయవాడ, చిలకలూరిపేట, చెన్నైల వైపు వెళుతుంటాయి. ఈ క్రమంలో నేడు ఈ దారిలో భారీ వాహనం వచ్చిందంటే గుంతల్లో ప్రమాదానికి గురై రెండు మూడు రోజులు మరమ్మతులు చేయించుకుని వెళ్ళాల్సిన పరిస్థితి ఏర్పడింది. దారి సంగతి తెలియక భారీ వాహనం వెళ్లిందా అదే రోడ్డులో రెండుమూడు రోజులు ఇరుక్కుపోయి. లేదా మరమ్మతులకు గురై లేదా పడిపోయి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.



తురకపాలెం రోడ్డు గుంతలమయంగా ఉన్న దృశ్యం

నడిచేందుకు కూడా వీల్లేని వైనం..

మండలంలోని వెంగళాయపాలెం నుంచి అంకిరెడ్డిపాలెం వరకూ రైతులకోసం ఏర్పాటు చేసిన ప్రధాన రహదారి డొంక నేడు కనీసం నడిచేందుకు కూడా వీలు లేకుండా పోయింది. చిన్నపాటి వర్షానికి రోడ్డు ఛిద్రమై పాదచారులు సైతం నరకం చూస్తున్నారు. ఈ డొంక రోడ్డును రైతులు తమ పొలాలకు ఎరువులు, ఇతర వ్యవసాయ పనులకు ఎక్కువగా వినియోగిస్తుంటారు. నేడు ఈ రోడ్డు ఎవ్వరికి పనికిరాకుండా పోయింది.

నల్లపాడు నుంచి తురకపాలెం రోడ్డు...

నిత్యం ఈ దారిలో సత్తెనపల్లి, నరసరావుపేటల నుంచి వందల సంఖ్యలో వాహనాలు నగరంలోనికి వెళుతుంటాయి. ఈ దారి సైతం గుంతల మయంగా తయారై రోజుకు ఒకటి రెండు ప్రమాదాలను చవిచూస్తూనే ఉంది. గుంతల్లో పడి చేతులు కాళ్ళు విరగ గొట్టుకున్నవారు ఎందరో..

పెదపలకలూరు– మల్లవరం రహదారి..

గత ప్రభుత్వంలో నూతన రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసి రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. ఎన్నికల అనంతరం రోడ్డు నిర్మాణం అర్ధాంతరంగా ఆగిపోవటంతో రోడ్డు గుంతలమయంగా తయారై ప్రయాణికులు రోజు ప్రమాదాల బారిన పడుతూనే ఉన్నారు. ఈ రోడ్డులో బండారుపల్లి, దాసుపాలెం, పలకలూరు, మల్లవరం, తోకావారిపాలెం గ్రామాల ప్రజలు నిత్యం తమ అవసరాలకు తిరుగుతూనే ఉంటారు. అధికారులు పట్టించుకోవటంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వ యంత్రాంగం ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా కృషిచేసి ప్రజల ప్రయాణ ఇక్కట్లు తీర్చేందుకు యుద్ధప్రాతిపదికన గ్రామీణ ప్రాంతాల రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని కోరుతున్నారు.